## చిన్నకథ

# గాడిద

**– డా. ఈరంకి సీతారామప్రసాద్**

మనుష్యుల మనస్తత్వాలను కాచి వడపోసామని మనలో ప్రతి ఒక్కరు ఏదో ఒక సందర్భంలో అనుకోవడం అతి సాధారణ విషయం. అయితే మన అంచనాలు తప్పు అని రుజువుపరిచి, మనలను ఆశ్చర్యానికి గురిచేసే సంఘటనలు కూడా జరుగుతూ ఉంటాయి. అటువంటి అనుభవం ఆరోజు కామేశ్వరరావుకు కలిగింది. ఆ రోజు ఏం జరిగిందంటే–

కాకినాడ మెయిన్‌రోడ్–

ఉదయం 10.30 గంటల సమయం

ముక్కంటి ఆప్టికల్స్–

ఇంకా తెరవని ఆ షాపు ముందు అసహనంగా అటూ, ఇటూ తిరుగుతున్నాడు. తెల్లగా, ఆరడుగుల ఎత్తు ఉన్న డబ్భై సంవత్సరాల రిటైర్డ్ ఎస్.పి. ఆనందరావు.

ఆయన కుడిచేతిలో విరిగిపోయిన కళ్ళజోడు, చొక్కాజేబులో కంటి డాక్టర్ ఎప్పుడో ఇచ్చిన కళ్ళద్దాల ప్రిస్క్రిప్షన్. ఆయన చాలా చిరాకుగా కూడా ఉన్నాడు. 'ఛీ! దిక్కుమాలిన షాపు. రోజూ తొమ్మిది గంటలకే తెరిచేషాపు ఈ రోజు పదిన్నరయినా ఇంకా తెరవలేదేమిటి? కళ్ళజోడు లేనిదే తనకు సరిగ్గా కళ్ళు కనిపించి చావవు. పెందరాళే కొత్త కళ్ళజోడుకు ఆర్డరిస్తే, అద్దాలు బిగించడానికి ఎంతలేదన్నా రెండు గంటలు పడుతుంది. కొత్త కళ్ళజోడు తీసుకొని ఇంటికి చేరేటప్పటికి ఒంటిగంట అవుతుంది. అప్పుడు టిండి తినాలి. అసలే తనకు పదకొండు గంటలకు భోజనం చేసే అలవాటు. వేళకు టిండి పడకపోతే కాళ్ళూ, చేతులూ వణుకుతాయి. ఈ షాపువాడు ఇంకా షాపు తెరవలేదు. ఈ షాపు తనకు నమ్మకం గల షాపు.

ఇంకొక షాపుకు వెళ్ళలేను... ఇదంతా ఆ గాడిద వల్ల జరిగింది. వాడు కళ్ళజోడు పగలకొట్టకపోతే తనకు ఈ బాధ ఉండేది కాదు గదా!'

ఆయన గాడిద అనుకొన్నది తన నాలుగు సంవత్సరాల మనవడు చిట్టిని. వాడి అసలు పేరు ఆనంద్. ఆనందరావు కొడుకు తన తండ్రి పేరే కొడుకుకు పెట్టాడు. నా పేరు పెట్టినా నా బుద్ధులు, క్రమశిక్షణ ఏమీ రాలేదు గాడిదకు' అనుకున్నాడు ఆనందరావు. ఇంతలో వెనకనుంచి "గుడ్ మార్నింగ్ సర్!" అన్న కేక విని వెనక్కి తిరిగాడు. ఎదురుగా కామేశ్వరరావు. ఎటెన్షన్‌లో నిలబడి పోలీస్ సెల్యూట్ చేస్తూ నవ్వుతున్నాడు. కామేశ్వరరావు కూడా రిటైర్డ్ పోలీసాఫీసరే. ఆనందరావు చిత్తూరు, అనంతపురం జిల్లాలలో సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్‌గా పని చేస్తున్న రోజులలో కామేశ్వరరావు సి.ఐ., డెప్యూటీ పోలీస్ సూపరింటెండెంట్‌గా ఆయన వద్ద పని చేసాడు.

"నువ్వా కామేశ్వర్రావు! కులాసాయేనా?" పలుకరించాడు ఆనందరావు.

"మీ దయ వల్ల కులాసాయే సార్! మీరేమిటి సార్... ఇక్కడ?"

"ఏం చెప్పమంటావయ్యా! ఆ గాడిద... అదే మా మనవడు.... చిట్టిగాడు నిన్న సాయంత్రం నా మీద కోపంతో నా కళ్ళజోడు విరగ్గొట్టాడు. కొత్త కళ్ళజోడు కోసం వచ్చాను".

"అరె... మీ మీద ఎందుకొచ్చింది కోపం?"

"వాడికి మూడు చక్రాల సైకిల్ కావాలట.... కొనమంటాడు. అప్పటికీ నేను 'కొందాములే' అన్నాను. వాడు ఇప్పుడేకావాలి అని పట్టుపట్టాడు. నాకు తిక్కరేగింది. 'నేను కొనను' అన్నాను. మా ఇద్దరి మధ్య పెద్దయుద్ధమే జరిగింది. వాడుకోపం పట్టలేక నా కళ్ళజోడు నేలకు విసిరికొట్టాడు... పైగా ఇంట్లోకి రానివ్వనన్నాడు. ఆ ఇల్లు నాది. వీడెవడు ఇంట్లోకి రానివ్వకపోవడానికి".

"అయ్యో! పోనీ సైకిల్ కొనెయ్యకూడదా సార్!"

"ఆ! ఆ! కొంటాను వీడి తాత ముల్లేమీలేదిక్కడ".

"మీరే గదా సార్! ఆ తాత! మీ దగ్గర లేక పోవడమేమిటి?" నవ్వుతూ అన్నాడు కామేశ్వరరావు.



అతని నవ్వు చూసి ఆనందరావుకు చిర్రెత్తుకొచ్చింది.

"ఉందయ్యా! ఉంది! ఉంటే ఈ రౌడీ రాస్కేల్‌కు సైకిల్ కొనాలా? కొనను. ఏం చేస్తాడో చూస్తాను. నా దగ్గరా వీడి కోతివేషాలూ.... కప్పగెంతులూను. నేనసలే రిటైర్డ్ పోలీస్ సూపరింటెండెంట్‌ను. కరుడుగట్టిన రౌడీలు, గుండాలచే డాన్స్ చేయించినవాడిని. నేనంటే ఏమనుకుంటున్నాడో. నా తడాఖా చూపిస్తాను... వస్తాను" అంటూ మీసం మెలివేస్తూ, షాపు తెరవడంతో లోనికి వెళ్ళిపోయాడు ఆనందరావు.

కామేశ్వరరావుకు ఆనందరావు మాటలు ఏమీ వింతగా అనిపించలేదు. కామేశ్వరరావుకు ఆయన స్వభావం బాగా తెలుసు. ఒకమాట ఆయన నోటి నుంచి వచ్చిందంటే.... దానికి కట్టుబడి ఉండే రకం. కామేశ్వరరావు దృష్టిలో ఆయన నీతి, నిజాయితీ గల ఒక ఆఫీసర్ మాత్రమే కాదు; ఒక బండరాయి, ఒక మొండి మనిషి. ఆయనలో మమతానురాగాలు ఆశించడం మూర్ఖత్వం. ఆయన ఈ జన్మకు మారడు. ఒక నిట్టూర్పు విడిచి ముందుకు కదిలాడు కామేశ్వరరావు.

అదే రోజు మధ్యాహ్నం 1 గం...

అయిదు వందల రూపాయల నోటుకు చిల్లర కోసం తనకు బాగా పరిచయమున్న ఒక సైకిల్ షాప్‌లో ప్రవేశించిన కామేశ్వరరావుకు అక్కడ కనిపించిన దృశ్యం ఆశ్చర్యానికి గురి చేసింది–

కొత్త కళ్ళజోడు పెట్టుకొన్న ఆనందరావు ఒక చిన్న స్టూల్‌మీద కూర్చుని ఎదురుగా ఉన్న కొత్త మూడు చక్రాల సైకిల్‌ను దీక్షగా పరిశీలిస్తూ అక్కడ ఉన్న మెకానిక్‌కు సూచనలు చేస్తున్నాడు. కామేశ్వరరావు ఒక స్తంభం వెనక నక్కి అంతా చూస్తున్నాడు.

"మా మనవడికి ఈ ఆకుపచ్చ రంగు అంటే ఇష్టమయ్యా! సీటుకు ఈ ఆకుపచ్చ రంగు స్పాంజికవరు వెయ్యి.... చూడు ఈ బెల్ సరిగ్గా మోగటం లేదు. దీనిని మార్చు" అంటూ హడావిడి చేస్తూ తెగ సంబరపడిపోతున్నాడు.

బిల్ చెల్లించి సైకిల్ చంకన పెట్టుకొని వస్తున్న ఆనందరావుకు హఠాత్తుగా కామేశ్వరరావు ప్రత్యక్ష మయ్యాడు ఎదురుగా!

దొరికిపోయిన దొంగలా ఉంది రిటైర్డ్ జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ గారి పరిస్థితి.

"ఏమిటి సార్! ఇది మూడు చక్రాల సైకిల్ కొనే ప్రసక్తే లేదని బీరాలు పలికేరు కదా!"

ఆనందరావు ఒక వెర్రి నవ్వు నవ్వాడు.

"ఏం చెయ్యను కామేశ్వరరావు. వాడంటే నాకు ప్రాణమయ్యా! వాడు అడిగింది ఏదీ నేను కాదనలేను. నీకో విషయం చెప్పేదా! నా జీవితంలో నాకు ఎదురు చెప్పి, నాతో గొడవ పెట్టుకునేది వాడొక్కడేనయ్యా! వాడితో గొడవపడటం నాకు సరదా! ఈ వయస్సులో నాకు కాలక్షేపం అదేనయ్యా! వాడు పసివాడు. వాడికింకా ఊహ రాలేదు. వాడికీ నేనంటే చాలా ప్రేమ.

అయినా కామేశ్వరరావు మనవళ్ళు, మనవరాళ్ళ కోసం కాకపోతే మన సంపాదన ఎందుకయ్యా! ఈ సైకిల్ చూసి ఎంత మురిసిపోతాడో గాడిద" ఆయన కళ్ళలో నీళ్ళను మొదటిసారిగా గమనించాడు కామేశ్వరరావు.

'మిమ్మల్ని సరిగ్గా అంచనా వెయ్యలేక నేను అయ్యాను సార్! గాడిదను' అనుకున్నాడు కామేశ్వరరావు ఆనందంగా, వెళ్ళిపోతున్న ఆయన వైపే చూస్తూ.

*

సెల్: 94402 85518